# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## పురిటిగడ్డకు పోరుబిడ్డ

అసెంబ్లీ ఎన్నికల్లో తమ పూర్వీకుల ప్రాంతమైన కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేస్తుండటంతో ఆ ప్రాంతవాసులు ఎంతో సంతోషపడుతున్నారు. అక్కడి ప్రజలు కేసీఆర్ రాకను ఆహ్వానిస్తున్నారు. ఆయన వస్తే తమ ప్రాంతం బాగుపడుతుందని ఆశపడుతున్నారు. మనది ప్రజాస్వామ్య దేశం. ఎవరు ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు. కేసీఆర్‌కు కామారెడ్డి ప్రాంతంతో పేగుబంధం ఉండటంతో ఇక్కడి నుంచి బరిలో నిలుచున్నారు. రానే రాదనుకున్న తెలంగాణ రాష్ర్టాన్ని సాధించి.. వరుసగా రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికై.. బంగారు తెలంగాణే లక్ష్యంగా శ్రమిస్తున్న కేసీఆర్ అంటే దేశంలో తెలియని వ్యక్తి ఉండరు.

ఉన్నత స్థితిలో ఉన్న కేసీఆర్ పురిటిగడ్డ రుణం తీర్చుకోవడానికి ఈసారి కామారెడ్డి నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. ఇదే విషయాన్ని పలు వేదికల మీద స్వయంగా కేసీఆరే చెప్పారు. కేసీఆర్ వస్తుండటం కామారెడ్డి ప్రజల్లో ఆశలను రేకెత్తిస్తున్నది. 'కామారెడ్డికి నేనొస్తున్నానంటే నావెంట అనేకం వస్తాయ్' అని ఇటీవల నామినేషన్ వేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో అశేష ప్రజానీకాన్ని ఉద్దేశించి స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. ఈ మాటలు విన్న ప్రజలంతా మన ప్రాంతానికి ఇక మహర్దశ పట్టినట్టేనని ఆనందానికి గురవుతున్నారు.




రాజధానికి సమీపంలోనే ఉన్నా సమైక్య పాలనలో గజ్వేల్‌లో ఆశించిన అభివృద్ధి జరగలేదు. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికై మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తించినా ఈ ప్రాంతం రాత మారలేదు. ఇప్పుడు ఈ ప్రాంతంలో ప్రగతి, పచ్చని పంటలు, జలాలు కనిపిస్తున్నాయి. ఎట్లుండే గజ్వేల్ ఇప్పుడు ఎట్లయ్యింది అనిపిస్తున్నది. కేసీఆర్ రెండుసార్లు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించడంతో ఈ ప్రాంతానికి మహర్దశ వచ్చింది. గజ్వేల్ ప్రాంతంలో లెక్కలేనంత అభివృద్ధి ఈ పదేండ్లలో జరిగింది. గ్రామాలు చాలా అభివృద్ధి చెందాయి. వ్యవసాయరంగంలో ఈ ప్రాంతంలో అద్భుత పురోగతి కనిపిస్తున్నది. మౌలిక వసతులు సమకూరాయి. ఈ అభివృద్ధే కామారెడ్డి ప్రజల్లో ఆశలు రేకెత్తిస్తున్నది.

నల్ల బెల్లం తయారీలో కామారెడ్డి పేరుగాంచింది. బీడీ పరిశ్రమకు నిలయం ఈ ప్రాంతం. కామారెడ్డి గంజ్ వాణిజ్యానికి పెట్టింది పేరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డెయిరీ టెక్నాలజీ, ఫారెస్ట్ కోర్సులు ఒక్క కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీకాలేజీతో పాటు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో మాత్రమే ఉండేవి. 44వ నంబర్ జాతీయ రహదారి, రైల్వేమార్గం, వ్యాపార వాణిజ్య పరంగా రాష్ట్రంలోనే పేరుగాంచిన కామారెడ్డి ప్రాంతానికి అనేక అనుకూలతలున్నాయి. ఇక్కడ అనేక ప్రాంతాల ప్రజలు బతుకుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా మెడికల్ ఏజెన్సీలు ఇక్కడే ఉన్నాయి. అన్నిరకాల పంటలు పండుతున్నాయి. సారవంతమైన నేలలున్నాయి. చెరువులున్నాయి. దేశంలోనే ప్రముఖ కాల భైరవ స్వామి ఆలయాల్లో ఒకటి కాశీలో ఉండగా..మరొకటి కామారెడ్డిలో ఉన్నది. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తే కామారెడ్డి దశదిశ మారనున్నదని ప్రజలు ఆశిస్తున్నారు.



యనిగండ్ల అశోక్
99083 50676

తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణకు మద్దతుగా అప్పట్లో రాష్ట్రంలోనే కామారెడ్డి బార్ అసోసియేషన్ తొలి తీర్మానం చేసింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రజా గాయకుడు రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో తొలి ధూంధాం కార్యక్రమం కామారెడ్డి గంజ్ నుంచి ప్రారంభమై సకల జనులను ఉర్రూతలూగించింది. తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసే క్రమంలో బీఆర్ఎస్ నిర్వహించిన కార్యక్రమంలో కేసీఆర్ కామారెడ్డి బ్రిగేడియర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

ఉద్యమవ్యాప్తి కోసం చేపట్టే సభలు, కార్యక్రమాల నిర్వహణ కోసం విరాళాల సేకరణకు బీఆర్ఎస్ పూనుకోగా.. కేసీఆర్ కామారెడ్డిలో స్వయంగా కూలీపనిలో పాల్గొని మూటలు మోశారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న బాంబే క్లాత్ హౌస్ బట్టల షాప్‌లో, సిరిసిల్ల రోడ్‌లో ఉన్న దేశాయి బీడీ కంపెనీలో కేసీఆర్ మూటలు మోసి చెమటలు చిందించారు.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులపై పోలీసుల తొలి కేసులు కామారెడ్డి ప్రాంతంలోనే నమోదు కావడం విశేషం.



## పల్లేర్లు మొలిసిన నేలలో..

నాడు తెలంగాణ భూములు నెర్రెలు వారి, పల్లేర్లు మొలసి, పడావు వడి పనికి రాకుండా ఉండేవి. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ భూములు పనికిరాకుండా పోయినయి. అటువంటిది ఇపుడు తెలంగాణ రాష్ట్రంలో ఎటు చూసిన పుట్ల కొద్దీ ధాన్యపు రాసులు కనిపిస్తున్నాయి. నేడు తెలంగాణ బంగారు పంటలు పండిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది.

అరవై ఏండ్లలో రైతుల గోసను పట్టించుకున్నవారెవరూ లేరు. వందల ఏండ్ల చరిత్ర గలిగిన పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ రైతుల కష్టాలను ఎన్నడూ తీర్చ లేదు. అలాంటి కాంగ్రెస్ మాటలను తెలంగాణలో ఎవరూ నమ్మే స్థితిలో లేరు. కర్ణాటకలో గెలిచామని, తెలంగాణలో గెలుస్తామని ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రజల ఆవేదనలను ఎన్నడూ పట్టించుకోలేదు. కర్ణాటక రైతులు ఇపుడు మొసళ్లను తెచ్చి, సబ్ స్టేషన్ల ముందు నిరసన తెలుపుతున్నారంటే వారి గోసను మనం అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ అంటేనే కాలయాపన. ఆ పార్టీతో తెలంగాణ అభివృద్ధి అసాధ్యం.

ఒకనాడు చెప్పులు వరుసలో పెట్టి యూరియా కోసం ఎదురుచూసినం, మళ్లీ మొసళ్లను తెచ్చి నిరసన తెలిపే పరిస్థితులను తెచ్చుకోవద్దు. కాంగ్రెస్ కాలయాపన కమిటీల పేరుతో తెలంగాణ రాష్ర్టాన్ని ప్రకటించకుండా, మరోవైపు ఉద్యమాన్ని అణచివేయాలని చూసింది. అటువంటి పార్టీ ఇప్పుడు అధికారమే ధ్యేయంగా చూస్తోంది. అందుకే మనం మరింత అప్రమత్తతతో మెదలాల్సిన అవసరం ఉన్నది.

'రైతు రాజ్యం రావాలి', 'రైతులు మహారాజు కావాలి' అంటూ రాజకీయ పార్టీలు తమ మనుగడ కోసం మాట్లాడే మాటలవి. ఆచరణలో అమలుకు నోచుకోవు. అన్నమో రామచంద్ర అన్నా, కనీసం కనికరించని కసాయి పాలనలో రైతు తనను తాను బలితీసుకున్న సంఘటనలు మన తెలంగాణలో ఒకప్పుడు ఎన్నో.

పుట్టెడు దుఃఖంతో తమ కష్టాన్ని తీర్చాలని శాంతియుత నిరసన చేస్తే రైతులపై తుపాకీ తూటాలు దించిన చరిత్ర. ఓ దశలో వ్యవసాయమే దండుగ అంటూ రైతుల బతుకులను సర్వనాశనం చేసిన సందర్భాన్ని చూశాం. తెలంగాణ రైతాంగాన్నే కాదు, తెలంగాణ రాష్ట్రంలో పంటలే పండకుండా, చుక్క నీరు మన భూములకు అందకుండా చేసిన దోపిడీ అంతా ఇంతా కాదు. నల్ల రేగడి భూములు, ఎర్రనేలలతో బంగారం లాంటి పంటలు పండే తెలంగాణను ఎడారిగా మార్చే ప్రయత్నం గట్టిగానే జరిగింది. ఫలితంగా రైతాంగం వ్యవసాయాన్ని వదిలి వలస వెళ్లారు. అటువంటి అమానవీయ దాడి రైతాంగంపై జరిగింది. రైతులను ఓటు బ్యాంకుగా చూశారే తప్ప, రైతు లేని రాష్ట్రం రాజు లేని రాజ్యం వంటిదని గుర్తించలేకపోయారు.

తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఉద్యమనాయకుడు కేసీఆర్ ఆధ్వర్యంలో పూర్తిగా మార్చివేశారు. 'నేడు నా తెలంగాణ కోటి ఎకరాల మాగాణి' అన్నట్టు వ్యవసాయాన్ని పండగలా మార్చారు. అందుకోసం రైతుకు మద్దతు ధర అందించడంతో పాటు పెట్టుబడి సాయం.. రైతుబంధు, రైతుబీమా లాంటి భరోసా కల్పించారు. మత్తడి దుంకుతున్న చెరువులు, పెరిగిన భూగర్భ జలాలు, తిప్పలు లేని కరెంటు సరఫరా... సకాలంలో ఎరువులు విత్తనాల సరఫరా చేయడం వల్ల రైతులు గుండె నిబ్బరంతో ఉండగలుగుతున్నారు.



సంపత్ గడ్డం
78933 03516

రైతుల వ్యథలు, కన్నీటి గోసలు తెలిసిన అసలు సిసలైన రైతు బిడ్డ మన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అందుకే, ఈ దేశానికి ఇప్పుడు రైతును ఆదర్శంగా నిలుపుతున్నారు. రైతు అభివృద్ధే,దేశాభివృద్ధిగా భావించే కేసీఆర్ పాలనలో మహారాజు అవుతున్నారు. ఈ దేశానికి ఇప్పుడు రైతు రాజ్యం కావాలి. అది కేసీఆర్ తోనే ఆవిష్కృతమవుతుంది.

## సంక్షేమానికి సలాం చేద్దాం

ఆమరణ నిరాహార దీక్షతో చావు అంచుల దాకా వెళ్లి, కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణ రాష్ర్టాన్ని సాధించిన్రు కేసీఆర్. అందుకే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు రెండు పర్యాయాలు అధికారం ఇచ్చారు. ప్రజలు తమపై పెట్టుకున్న ఆశలకనుగుణంగా ఈ తొమ్మిదిన్నరేండ్లలో రాష్ర్టాన్ని అన్నిరంగాల్లో దేశానికే ఆదర్శవంతంగా నిలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ఒకే పర్యాయం జరుగుతుండటం గమనార్హం.

2014లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1 లక్షా 14 వేలు ఉంటే ప్రస్తుతం రూ.3 లక్షల 17 వేలకు పురోగతి సాధించింది. అంటే ఈ తొమ్మిదిన్నరేండ్లలో మూడు రెట్లు పెరిగింది. ఇది దేశంలోనే అగ్రస్థాయి అభివృద్ధి అని అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. అదేవిధంగా వృద్ధిరేటులో కూడా దేశంలో అగ్రభాగాన ఉన్న మొదటి ఐదు రాష్ర్టాల్లో తెలంగాణ రాష్ట్రం ఒకటిగా ఉన్నది. వ్యాపార, పారిశ్రామిక రంగానికి చెందిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం దేశంలో రెండవ స్థానంలో ఉన్నది. ఐటీ ఎగుమతుల్లో రాష్ట్రం 400 శాతం అభివృద్ధి చెందడం విశేషం.



రాష్ట్ర సాధన సమయంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే విద్యుత్తు, నీటి కొరతలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతారని ఎగతాళి చేశారు. 2014లో తెలంగాణలో విద్యుత్తు ఉత్పత్తి 7 వేల మెగావాట్లు ఉంటే ప్రస్తుతం 23 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతున్నది. దీంతో రాష్ట్రంలో వ్యవసాయానికి, పారిశ్రామిక రంగానికి, గృహావసరాలకు 24 గంటలు విద్యుత్తు సరఫరా అవుతున్నది. ఇది నిజంగా గొప్ప పరిణామం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో క్రాప్ హాలీడేలు లేవు. అదేవిధంగా పారిశ్రామిక రంగానికి, గృహావసరాలకు ఎక్కడా విద్యుత్తు కోతలు లేవు. 2014లో వరి 68 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగేది. ప్రస్తుతం 3 లక్షల 50 వేల టన్నుల ఉత్పత్తి జరుగుతున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం ద్వారా రాష్ట్రంలో వేలాది చెరువులకు పూడికలు తీసి జలకళ సృష్టించింది. రాష్ట్రమంతా కొత్తగా వేలాది వాటర్‌ట్యాంకులు నిర్మించింది. మిషన్ భగీరథ ద్వారా కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీటి వసతి కల్పించింది. భూ సమస్యల పరిష్కారానికి ధరణిని తీసుకొచ్చింది. గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో కలిపి 24 లక్షల ఉద్యోగ నియామకాలు జరిగాయి. గతంలో ఉన్న ఐదు మెడికల్ కాలేజీలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఇరువై ఒకటి మెడికల్ కాలేజీలను కొత్తగా ఏర్పాటు చేసింది. బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ వందలాది గురుకుల పాఠశాలలు నిర్మించింది. ప్రతి జిల్లా కేంద్రంలో నూతన పాలన భవనాలను నిర్మించింది. యాదాద్రి నిర్మాణం, అంబేద్కర్ సచివాలయం, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారక స్తూపం వంటి నిర్మాణాలు రాష్ర్టానికి తలమానికంగా నిలుస్తున్నాయి.

రైతుబంధు, దళితబంధు, రైతుబీమా, బీసీబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు, కంటివెలుగు, కేసీఆర్ కిట్టు, ఆరోగ్యలక్ష్మి లాంటి అనేక సంచలనాత్మక సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శవంతంగా నిలుస్తున్నాయి. ఇక రానున్న కాలంలో రాష్ట్రంలోని 93 లక్షల కుటుంబాల్లో మనిషి ఎలా మరణించినా ఆ వ్యక్తి కుటుంబానికి తక్షణమే రూ. 5 లక్షల కేసీఆర్ బీమా భరోసా, తెల్లరేషన్ కార్డుదారులకు, జర్నలిస్టులకు రూ.400లకే గ్యాస్ సిలిండర్, అన్నపూర్ణ పథకం ద్వారా సన్న బియ్యం ఇవ్వడం, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.15 లక్షలకు పెంచడం, ఆసరా పింఛన్ల పెంపుదల, మహిళలకు సౌభాగ్యలక్ష్మి వంటివి అమలు జరిగితే కేసీఆర్ కీర్తి ప్రతిష్టలు అంబరాన్నంటుతాయనడంలో అతిశయోక్తిలేదు. తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం అనటంలో ఏ మాత్రం సందేహం లేదు.



కైలసాని శివప్రసాద్
94402 03999



## ఇంకా నయ్యం!

ఈ నెల 30వ తేదీన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆయా పార్టీలు ప్రజలను తమవైపు తిప్పుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రజలు ఓట్లు వేస్తేనే అధికారంలోకి వచ్చే రాజకీయ పార్టీలు తమ తమ మ్యానిఫెస్టోతో ప్రజలను ఆకర్షించేందుకు పోటీ పడుతున్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, డీఎస్పీ, ఇతర పార్టీలు మ్యానిఫెస్టోను కొన్నిరోజుల కిందటే విడుదల చేశాయి. అయితే అధికార యావలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలను తీసుకొచ్చింది. 10కి మించిన సరికొత్త హామీలతో బీఎస్పీ బహుజన వాదాన్ని ప్రజల ముందుంచింది. డీఎస్పీ దశ వాగ్దానాలను ప్రకటించింది.

అయితే అన్ని పార్టీల మ్యానిఫెస్టోలు దాదాపు ఒకే తీరుగా ఉన్నాయి. ఇదిలా ఉంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కొంత ఆలస్యంగానైనా... కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో పలు అంశాలతో కూడిన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. సకలజనుల సౌభాగ్య పేరుతో ఇందులో 10 ప్రధానాంశాలను షా ప్రకటించారు. వీటికితోడు రాష్ట్రంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు.. 'బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో ఉన్న వృద్ధులను అయోధ్య, కాశీ లాంటి యాత్రలకు ఉచితంగా తీసుకువెళ్తాం' అని కూడా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారాన్ని చూసి 'ఇంకా నయ్యం.. స్వర్గానికి ఉచితంగా తీసుకెళ్తామని' ప్రచారం చేయడం లేదని ప్రజలు వ్యంగ్యంగా చర్చించుకుంటున్నారు.



తలారి గణేష్
99480 26058



## రాష్ట్రం రాకమున్పు

రాష్ట్రం రాకముందు రాళ్ల చెలుక
కరెంటు లేని కాలం
నెర్రలిడిసిన నేల
పంట పండని బీడు చెలుకలు

ఎండిపోయిన ఊరి చెరువులు
ఊరిలో తాగునీటి కరువులు
సేద్యమంటే భయమై చెలక విడిసిన వైనం
అప్పులతో రైతు రాలిన రోజులు

దిన దిన గండమై దిక్కులు చూసిన నాడు
కరెంటు కోసం కావలి కాసిన రోజులు
రాత్రంతా బోరు కాడ నిద్రకాసెను నాడు
రైతునే నేడు రాజు చేసేను చూడు

నింగి గంగను ఏ భగీరథుడు తెచ్చేనో?
పొలములో పొంగి పారేగంగా
ఏటి నుండి నీటిని ఎవరు తెచ్చే
బక్కపలుచని భగీరథుడే కదా !


కొత్త కొత్త పథకాలు కోరి తెచ్చిండు
ఇంటింటికి సాయం అందజేసిండు
సకల జనులకోసం సంక్షేమ పథకాలు
రైతు బాధలు లేని రాష్ట్రమే మనది

కల్యాణ లక్ష్మి కారకుడు ఎవరు?
రైతు బీమా సృష్టించిన రాజు ఎవరు?
అమ్మలాంటి అభివృద్ధిని అడ్డుకుంటే
ఆకలి రాజ్యం ఆవహించినట్టే !



దేవరపాగ కృష్ణయ్య
99634 49579

## ప్రహసనం



ప్రాంతీయత అంటే గిట్టని
జాతీయ నాయకత్వం
పిచ్చుకల పైననా ?
బ్రహ్మాస్త్ర ప్రయోగం

హోదాను మరిచి విష ప్రసంగాలు
పసికందులపై సవతి ప్రేమలు
శకుని కపట పగల సెగల కుట్రలు
కక్షలు వివక్షలు కుతంత్రాలు

తెలంగాణ రాష్ట్రం నచ్చని కేంద్ర పెద్దలు
నానా రాష్ట్రాల యోగుల, బోగుల,
బైరాగుల విన్యాసాలు
విమానాల్లో వీసా- గీసా రాకపోకలు
దూషణ భూషణలతో చెవులు చిల్లులు

ప్రజల మంచి చెడులకు తిలోదకాలు
అలవికాని మ్యానిఫెస్టోల ప్రలోభాలు
నేత అనైతిక గులాములుగా సలాములు
సుతిమెత్తగా దేశ ఖజానాకు బురిడీలు

అత్యున్నత ప్రజాస్వామ్య భారతదేశం
మాయోపాయాలతో జగన్నాటకం
ప్రధానులు తమ హోదాను విడిచిన వైనం
జనమన్నిక కోల్పోయిన ఎన్నికల
ప్రహసనం



నమిలకొండ నాగేశ్వర్ రావు
86885 53470

## అమలు చేయలేని మ్యానిఫెస్టో!

తెలంగాణ రాష్ట్రంలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ ఎన్నికల ప్రణాళికను ప్రకటించింది. అది 80 పేజీలతో రూపొందించిన మ్యానిఫెస్టో. అందులో ప్రధానమైన వాటిని కొన్నింటిని చర్చించుకుందాం. బీజేపీ మ్యానిఫెస్టో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడుతుందో చూద్దాం..!



**సమ్మక్క- సారక్క గిరిజన యూనివర్సిటీ..:** రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే గిరిజనులకు సమ్మక్క–సారక్క పేర్ల మీద గిరిజన యూనివర్సిటీని నిర్మిస్తామంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనులకు రిజర్వేషన్ పెంచుతూ అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రానికి పంపింది. కానీ కేంద్రం నేటికీ స్పందించలేదు. నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి రాష్ట్రపతి, గిరిజన బిడ్డ ద్రౌపది ముర్మును ఆహ్వానించలేదు. అలాంటి వారికి గిరిజనులపై ప్రేమ ఉన్నదంటే నమ్మగలమా?

**గ్యాస్ సిలిండర్ల ధర తగ్గించటం :** గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గిస్తామని మ్యానిఫెస్టోలో ప్రస్తావించారు. పదేండ్లుగా గ్యాస్ ధరలు పెంచుతూ పోతున్న కేంద్రం గ్యాస్ ధరలు తగ్గిస్తామంటే ప్రజలెలా నమ్ముతారు.

**బీసీ ముఖ్యమంత్రి:** రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిగా చేస్తామని ఆ పార్టీ ప్రకటించింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను పక్కనపెట్టి అగ్రకులానికి చెందిన వారిని అధ్యక్షుడిగా చేసింది. అలాంటి బీజేపీ చేసిన బీసీ ముఖ్యమంత్రి ప్రకటనను ఎవరూ నమ్ముతారు.

**ఎస్సీ వర్గీకరణ :** ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏండ్లుగా ఉద్యమం కొనసాగుతున్నది. వర్గీకరణకు తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. కానీ కేంద్రం స్పందించలేదు. అంటే వర్గీకరణపై చిత్తశుద్ధి లేదనేది స్పష్టం.

**తెలంగాణ రాష్ట్ర పూర్వ వైభవం:** అంటే రాజుల కాలం నాటి రాజరిక వ్యవస్థనా? మరేదైనా? ఆ పార్టీకే క్లారిటీ లేదు.

**అధికారికంగా విమోచన ఉత్సవాలు :** తెలంగాణ విమోచన ఉత్సవాలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించడం సరైనదే. కానీ ప్రజలు ఎవరి నుంచి విమోచన పొందారు నిజాం రాజు నుంచా? స్థానిక దొరల నుంచా? ప్రజలకు విప్పిచెప్పాలి. అప్పుడే కదా అర్థమయ్యేది.

**అర్చకుల జీతాలు పెంచడం:** ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం అర్చకులకు జీతాలు ఇస్తున్నది. పెంచటం మంచిదే కానీ, అర్చకులుగా ఇతర కులాల వారిని ఎందుకు నియమించకూడదు?

**కృష్ణానది జలాల్లో తెలంగాణ వాటా తేల్చడం:** కృష్ణానది జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలనుకునే బీజేపీ తెలంగాణకు రావలసిన వాటాను ఇవ్వటం లేదు. పైగా కర్ణాటక ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇస్తూ తెలంగాణ వాటాను దక్కకుండా చేస్తున్నది.

**సమగ్ర ధాన్యలక్ష్మి ప్రణాళిక:** సమగ్ర ధాన్యలక్ష్మి పథకం ప్రవేశపెట్టి రైతులు పండించే ధాన్యాలకు సరైన గిట్టుబాటు ధరను కల్పిస్తామని చెప్తున్నది. కానీ కేంద్రం వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టి వ్యవసాయ రంగాన్ని ప్రైవేటీకరించాలని చూస్తున్నది.

**పసుపు బోర్డు ఏర్పాటు:** పదేండ్లుగా కేంద్రాన్ని ఒప్పించలేని రాష్ట్ర బీజేపీ నాయకులు ఇప్పుడు 'పసుపు బోర్డు' ఏర్పాటుచేస్తామని చెప్పడం హాస్యాస్పదం.

**నారీ శక్తి వందన్:** నారీ శక్తి వందన్ పేరుతో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు అమలుచేయడం ద్వారా చట్టసభలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు అవకాశం కల్పిస్తామంటున్నారు. కానీ బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించకుండా రిజర్వేషన్లు తీసుకురావాలనుకోవటం వారిని చట్టసభలకు దూరం చేయడమే.

**గిరిజన సంప్రదాయాల పరిరక్షణ:** గిరిజనుల సం స్కృతి. సంప్రదాయాలను పరిరక్షిస్తామని బీజేపీ చెప్పటం విడ్డూరం. ఆదివాసులున్న ప్రాంతాల్లో ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తూ వారి సంస్కృతిని బీజేపీ విధ్వంసం చేస్తున్నది. సాధ్యం కానీ హామీలతో విడుదల చేసిన బీజేపీ మ్యానిఫెస్టోతో ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదు.



గుండమల్ల సత్యనారాయణ
95059 98838